

టన్ను చీనీ రూ.29,190
అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.29,190, కనిష్టంగా రూ.13 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాటా రూ.33
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.33, కనిష్టంగా రూ.20, సరాసరిన రూ.26 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
30.4°/14.2°
జిల్లా పరిధిలో గురువారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలి వాతావరణం పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

శుక్రవారం | 29 | నవంబర్ | 2024

న్యూస్‌రీల్

పకడ్బందీగా సాగునీటి సంఘం ఎన్నికలు

- ఏర్పాట్లు పక్కాగా చేయాలని కలెక్టర్ చేతన్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలో సాగునీటి సంఘం ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సాయి ప్రసాద్ సాగునీటి సంఘాల ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్ జిల్లా నీటి పారుదలశాఖ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో చిన్న నీటి పారుదల సంఘాలు 214 , మధ్యతరహా సాగునీటి సంఘాలు 16 మొత్తం 230 సంఘాలు ఉన్నాయన్నారు. వీటికి డిసెంబర్ 5న నోటిఫికేషన్ ఇస్తామని, 8న ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయసారథి, ఇరిగేషన్ డీఈ గంగాద్రి, ఏఈఈ జమునా బాయి తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలకు చెక్


- జిల్లా స్థాయి సమీక్షలో డీఎంహెచ్‌ఓ మంజువాణి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మంజువాణి

పుట్టపర్తి అర్బన్: మాతా శిశు మరణాలకు చోటు లేకుండా రక్షణ కవచంగా నిలవాలని , జిల్లాలో ఒక్క మాతా శిశు మరణం సంభవించకుండా చూడాల్సిన బాధ్యత మనదేనని డీఎంహెచ్‌ఓ మంజువాణి సిబ్బందితో పేర్కొన్నారు. గురువారం స్థానిక వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా స్థాయి సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాతా శిశు మరణాలు చోటు చేసుకున్న ప్రాంతంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. సమీక్షలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో రెండు మాతృ మరణాలు, నాలుగు శిశు మరణాలు సంభవించడం బాధాకరమన్నారు. గర్భిణీ అయినప్పటి నుంచి సురక్షితంగా కాన్పు అయ్యే వరకూ తల్లీబిడ్డను రక్షించాలన్నారు. ప్రతి నెలా గర్భిణీలకు పీహెచ్‌సీల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మనందరి ఉద్యోగం తల్లీబిడ్డలను రక్షించడమేనని, వారిలో ఎవరు మృతి చెందినా ఆ కుటుంబాలకు తీరని శోకం మిగిల్చిన వారవుతామన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సెల్వియా సాల్మన్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి నాగేంద్ర నాయక్, గైనకాలజిస్ట్ డాక్టర్ శశికళ, చిన్నపిల్లల వైద్యులు క్రాంతి, డీపీహెచ్ఎన్ఓ వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న డాక్టర్ నివేదిత

పుట్టపర్తి: జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా ఆరోగ్య ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ నివేదిత తెలిపారు. గురువారం ఆమె బుక్కపట్నం మండల పరిధిలోని సిద్దరాంపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు అందించారు. వైద్య పరీక్షల సమయంలో చెవిటి, మూగ లాంటి వారిని గుర్తిస్తే వారికి సరైన వైద్యం అందించవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామ్మోహన్‌చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

8న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

సాక్షి, పుట్టపర్తి : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష డిసెంబరు 8న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్‌టికెట్లు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు స్కూల్ యూడైస్ కోడ్ ద్వారా లాగిన్ అయి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థులకు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

- ఈనెల 20వ తేదీన నల్లమాడ మండలం కొత్తపల్లి తండాలో నాటు సారా తయారీ స్థావరంపై ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి 300 లీటర్ల బెల్లం ఊట, మూడు లీటర్ల నాటుసారా ధ్వంసం చేశారు. సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ముమ్మరంగా దాడులు చేస్తున్నట్లు తెలిపారు. అయితే తయారీదారులు ఎవరనేది బహిర్గతం చేయలేదు.
- ఈనెల 15వ తేదీన బుక్కపట్నం మండలం నార్సింపల్లి తండా పరిధిలో పుట్టపర్తి ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. నాటుసారాకు ఉపయోగించే దాదాపు 450 బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అయితే నాటుసారా ఎవరు తయారు చేస్తున్నారనే విషయం బహిర్గతం చేయలేదు. దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



నాటుసారా ధ్వంసం చేసిన దృశ్యం

గ్రామాల్లో.. గుడుంబా కిక్కు!



జిల్లా వ్యాప్తంగా నాటుసారా తయారీ జోరుగా సాగుతోంది. అడపాదడపా ఎక్సైజ్ అధికారులు దాడి చేస్తున్నా .. నాటుసారా తయారీదారులను మాత్రం పట్టుకోవడం లేదు. దీంతో నాటుసారా తయారీ ఆగడం లేదు. దీంతో ప్రతి పల్లెలోనూ గుడుంబా ఫుల్లు కిక్కు ఇస్తోంది.

- ఊరూరా విచ్చలవిడిగా నాటుసారా
- శివారు ప్రాంతాల్లో గుట్టుగా వ్యాపారం
- అంతంత మాత్రంగానే ఎక్సైజ్ దాడులు
- 'తమ్ముళ్లు' పట్టుబడినా అరెస్టు చూపని వైనం !



బుక్కపట్నం మండలం నార్సింపల్లి తండాలో ..



నల్లమాడ మండల పరిధిలో..

సాక్షి, పుట్టపర్తి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పల్లెలు మత్తులో తూగుతున్నాయి. జిల్లాలో కర్ణాటక మద్యం ఏరులై పారుతుండగా...ఏ గ్రామంలో చూసినా బెల్టు షాపులే దర్శనమిస్తున్నాయి. ఇక చాలా గ్రామాల్లో నాటుసారా గుప్పుమంటోంది. గ్రామ శివారుల్లో గుట్టు చప్పుడు కాకుండా సారా తయారీ చేస్తూ.. పట్టణాలకు ఎగుమతి చేస్తున్నట్లు సమాచారం. ప్లాస్టిక్ కవర్లలో 100 ఎంఎల్ చొప్పున ప్యాకింగ్ చేస్తూ అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది సిండికేటుగా మారి ప్రైవేటు వాహనాల్లో రాత్రివేళల్లో నాటుసారా అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ దందా వెనుక కూటమి పార్టీల నాయకుల పాత్ర ఉండటంతో పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఎక్సైజ్ అధికారులు మాత్రం అడపాదడపా దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. అక్కడక్కడా నాటుసారా ఊట ధ్వంసం చేస్తున్నారు. కానీ ఇంతవరకు ఒక్కరినీ అరెస్టు చేయకపోవడం గమనార్హం.

సమాచారం ఉన్నప్పటికీ..

నాటుసారా తయారీ కేంద్రాల గురించి ఎక్సైజ్ సిబ్బందికి పక్కా సమాచారం అందుతోంది. అందుకే నేరుగా నాటుసారా తయారీ స్థావరాల వద్దకు వెళ్తున్నారు. అయితే బెల్లం ఊట ధ్వంసంతో సరిపెడుతున్న ఎక్సైజ్ అధికారులు...నాటుసారా ఎవరు తయారు చేస్తున్నారనే విషయం మాత్రం తమకు తెలియదని చెబుతుండటం పలు అనుమానాలకు దారి తీస్తోంది. కూటమి నేతల ఒత్తిళ్లతో నాటుసారా తయారీదారుల పేర్లు బయటపెట్టడం లేదన్న విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. అంతేకాకుండా కొన్ని చోట్ల నాటుసారా తయారు చేస్తున్నట్లు ప్రజలే సమాచారం ఇచ్చినా...అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. మమూళ్లకు అలవాటు పడిన అధికారులు కొందరు నాటుసారా తయారీని చాలా మామూలుగా తీసుకున్నట్లు తెలుస్తోంది. మామూళ్లు ఇవ్వకపోతే వెంటనే దాడులు చేస్తున్నారని సారా వ్యాపారులు వాపోతున్నారు.

ప్రాంతానికో రీతిన దందా..

ధర్మవరం, సీకే పల్లి ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో నాటుసారా తయారీ, అమ్మకాలు అధికంగా ఉన్నట్లు సమాచారం. ఇటీవల పుట్టపర్తి స్టేషన్ పరిధిలోనూ నాటుసారా తయారీ వెలుగులోకి రావడం విశేషం. మరోవైపు కర్ణాటక సరిహద్దులో అక్రమ మద్యం సరఫరా జరుగుతోంది. హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కల్తీ కల్లు రాజ్యమేలుతోంది. మడకశిర, పెనుకొండ ప్రాంతాల్లో కర్ణాటక మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు.

మద్యం పట్టుబడింది టీడీపీ అనుచరుడి ఇంటిలోనే..

హిందూపురం మండలం తూమకుంటలో బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి మంజునాథ్ ఇంట్లో 13 బాక్సుల కర్ణాటక మద్యం ప్యాకెట్లు (1248) స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే అతను టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప సమీప బంధువు కావడం విశేషం. మంజునాథ్ కర్ణాటక నుంచి మద్యం అక్రమంగా తీసుకొచ్చి హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లోని బెల్ట్ షాపులకు అందించేవాడని, అతని కోసం గాలిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

ఉపేక్షించేది లేదు

కల్తీ కల్లు, కర్ణాటక మద్యం, నాటుసారా విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నాం. సమాచారం వచ్చిన వెంటనే దాడులు చేసి నిందితులను అదుపులోకి తీసుకుంటున్నాం. అయితే చాలాసార్లు దాడుల ముందస్తు సమాచారంతో దుండగులు పరారవుతున్నారు. అందువల్లే నాటుసారా తయారీ చేసే వాళ్లు పట్టుబడటం లేదు. ప్రజలు పక్కా సమాచారం ఇస్తే తప్పక చర్యలు తీసుకుంటాం. అక్రమాలను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించం.
– గోవిందనాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

అంతా 'పచ్చ' పాతమే



టేబుల్‌పై 30 ప్యాకెట్లు ఉన్నా.. 27 ఉన్నట్లు విడుదలైన ప్రకటన, అలాగే నిందితుల పేర్లు కూడా వెల్లడించని వైనం

పుట్టపర్తి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది తీరు సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పడటంతో బెల్టు షాపులు ఊరూరా వెలిశాయి. ఇదే అదునుగా ఎక్సైజ్ సిబ్బంది జేబులు నింపుకోవాలనేయత్నం చేస్తున్నారని, కూటమి నేతల ఒత్తిళ్లతో నెలవారీ మామూళ్లు సక్రమంగా రాకపోవడంతో అడపాదడపా దాడులు చేస్తూ అరెస్టులు చూపిస్తున్నారన్న విమర్శలున్నాయి. అయితే కూటమి పార్టీల ప్రజాప్రతినిధుల నుంచి ఫోన్లు రావడంతో పట్టుబడిన వ్యక్తి ఎవరు? అనే విషయంలో బహిర్గతం చేయకుండా దాచిపెడుతున్నారు. నిందితులతో కుమ్మక్కయ్యారా? లేక కూటమి నేతలకు తలొగ్గారా? అనేది సస్పెన్స్‌గా మారింది. మరోవైపు పట్టుబడిన మద్యం బాటిళ్ల సంఖ్య కూడా తక్కువగా చూపిస్తుండటం గమనార్హం.

పేర్లు చెప్పరెందుకో?

ఎక్సైజ్‌స్టేషన్‌లో పని చేసే ఒకరిద్దరి నిర్వాకంతోనే వ్యవస్థకు చెడ్డపేరు వస్తోందనే విమర్శలు ఉన్నాయి. అధికారుల సమన్వయ లోపంతో నిబంధనలు ఉల్లంఘించిన వెంటనే సమాచారం బయటికి వస్తోంది. పట్టుబడిన సమయంలో టేబుల్‌పై ఉన్న బాటిళ్లు.. అధికారులు వెల్లడించే బాటిళ్ల సంఖ్యలోనూ వ్యత్యాసం ఉంటోంది. పేర్లు వెల్లడించకుండా.. ఒకరిని అదుపులోకి తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. పట్టుబడిన వారు టీడీపీకి చెందిన వారు కావడంతోనే పేర్లు గోప్యంగా ఉంచుతున్నారనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు పేర్లు వెల్లడించకుండా ఉండేందుకు వారి వద్ద నుంచి కొంత మేర లంచం కూడా తీసుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి.

స్టాక్ పాయింట్ తనిఖీ చేసిన జేసీ

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్‌ను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములోని స్టాక్‌ను పరిశీలించారు. సరుకుల వివరాలను స్టాక్ పాయింట్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పక్కనే ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. రీ సర్వేకు సంబంధించిన రాళ్లను పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఫ్రీహోల్డ్ భూముల లెక్కలకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు రికార్డులను పరిశీలించారు. జేసీ వెంట తహసీల్దార్ సురేష్‌కుమార్, సీఎస్‌డీటీ సావిత్రి, సిబ్బంది ఉన్నారు.



రీ సర్వే రాళ్ల పనులను పరిశీలిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

చిలమత్తూరులో...

చిలమత్తూరు: మండల పరిధిలోని సోమఘట్ట పంచాయతీ కొక్కవాండ్లపల్లిలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ గురువారం పర్యటించారు. ఆయన గ్రామానికి చెందిన కుళ్లాయప్ప అనే వ్యక్తి పీజీఆర్ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) అర్జీ ఇవ్వగా జేసీ విచారణ చేసేందుకు గ్రామానికి వచ్చారు. అయితే సమస్య తమ పరిధిలో లేనందున సివిల్ కోర్టులో సమస్య పరిష్కరించుకోవాలని అర్జీదారుడికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యూనిస్‌బాబు పాల్గొన్నారు.

రేపు నేమకల్లుకు సీఎం

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామంలో శనివారం సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు జిందాల్ విజయనగర ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 12.45 గంటలకు నేమకల్లుకు సీఎం చేరుకుంటారు. 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. అనంతరం నేమకల్లు అంజనేయస్వామి వారిని దర్శించుకుని, గ్రామ ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహిస్తారు. 3.45 గంటలకు హెలికాప్టర్‌లో నేమకల్లు నుంచి జిందాల్ విజయనగర్ ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి ప్రత్యేక విమనంలో విజయవాడకు బయలుదేరి వెళతారని అధికార వర్గాలు తెలిపాయి.



గ్రామ సభ వేదికను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



లోహిత్‌తో పాఠశాల ఉపాధ్యాయులు

చిలమత్తూరు(లేపాక్షి): కొండూరు జెడ్పీహెచ్ఎస్‌లో 9 వ తరగతి చదువుతున్న లోహిత్ జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శేషగిరి బాబు , పీడీ శివకుమార్ గురువారం తెలిపారు. ఈనెల 24 నుంచి 26 వరకూ తిరుపతిలో జరిగిన అండర్–14 బేస్‌బాల్ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా తరపున ఆడిన లోహిత్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడన్నారు. దీంతో నిర్వాహకులు ఆంధ్రప్రదేశ్ టీంకు ఎంపిక చేశారన్నారు. డిసెంబరు 19 నుంచి 22 వరకూ చత్తీస్‌ఘడ్ లోని బిలాస్‌పూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో లోహిత్ పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు. జాతీయ స్థాయి పోటీలకు లోహిత్ ఎంపిక కావడంపై స్థానికులు కూడా హర్షం వ్యక్తం చేశారు.

నేరాల నియంత్రణకు సమష్టిగా కృషి

ధర్మవరం రూరల్/ధర్మవరం అర్బన్: సమష్టిగా పనిచేస్తూ నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పోలీసు సిబ్బందికి ఎస్పీ వి.రత్న సూచించారు. ప్రజల్లో విశ్వసనీయత పెంచడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. గురువారం ధర్మవరం మండలం పోతుకుంట పోలీస్ గెస్ట్‌హౌస్‌లో ధర్మవరం సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, పోక్సో, గంజాయి, మర్డర్ , చోరీలు, ఎన్‌డీపీఎస్, గ్యాంబ్లింగ్, రోడ్డు ప్రమాదాలు, పెండింగ్ కేసులు తదితర వాటిపై సమీక్షించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా కేసులు పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. చాలా కాలం పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కేసులు, మర్డర్, పోక్సో, రోడ్డు ప్రమాదాలపై పోలీస్ అధికారులు పూర్తిగా దృష్టి పెడితే క్రైమ్ రేట్ తగ్గించవచ్చనన్నారు. చోరీ కేసులపై దృష్టి సారించి జరిగిన వెంటనే కేసును ఛేదించే విధంగా పని చేయాలన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, వారి నడవడిక సరిగా లేకపోతే వారిపై షీట్ ఓపెన్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి వాటిని నివారించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ సందర్శనలు, పల్లె నిద్ర కార్యక్రమాలు చేపట్టి అక్రమ మద్యం, గంజాయి, కోడి పందాలు, మట్కా, నాటుసారా, వంటివి పూర్తిగా అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్‌బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రత్న

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

ధర్మవరం రూరల్: అందరూ సమానత్వంతో జీవిస్తూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ రత్న అన్నారు. గురువారం మండల పరిధిలోని కుణుతూరులోని ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా సివిల్ రైట్స్ డేను నిర్వహించారు. ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల మధ్య అసమానతలు తొలగిపోయినప్పుడే సామాజిక వివక్ష తొలగిపోతుందని పేర్కొన్నారు. నిరక్షరాస్యత, పేదరికంతో వెనుకబడిన ప్రజలకు పౌర హక్కుల పరిరక్షణ గురించి అవగాహన కల్పించాలన్నారు. పౌరులకు ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు పోలీసులకు సహకరించాలన్నారు. అనంతరం ఎస్పీ రత్న ఎస్సీ కాలనీలో తిరుగుతూ ప్రజలతో మమేకమై సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ప్రభాకర్, ఎస్ఐలు శ్రీనివాసులు, ప్రదీప్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం

- అందరి సహకారం అవసరం
- ఐసీడీఎస్ పీడీ సుధా వరలక్ష్మి



పుట్టపర్తి: క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ అధికారులు పేర్కొన్నారు. బాల్య వివాహాల నివారణలో భాగంగా పుట్టపర్తిలోని గణేస్ సర్కిల్‌లో వైద్య ఆరోగ్యశాఖ , ఐసీడీఎస్ అధికారులు, సమత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మరోవైపు జిల్లా వ్యాప్తంగా ఆయా కేంద్రాల్లోని అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది, మహిళా పోలీస్‌లు కలిసి కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ సుధా వరలక్ష్మి, వైద్యాధికారిణి జ్యోత్స్న, సీహెచ్‌ఓ నగేష్, సీడీపీఓ గాయత్రి, సమత కోఆర్డినేటర్ శోభ తదితరులు మాట్లాడారు. బాల్య వివాహాల అనర్థాలను ప్రతి తల్లీ తెలుసుకోవాలన్నారు. బాల్య వివాహాలతో ఆడపిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, దీంతో ఆ కుటుంబం అంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదన్నారు. బాల్య వివాహాలను నిరోధించేందుకు ఏర్పాటు చేసిన 1098 టోల్ ఫ్రీ నంబర్ బాలికలకు బాసటగా నిలుస్తుందన్నారు. విద్య పూర్తి చేసి అనుకున్న లక్ష్యాలను చేరుకున్న తర్వాతనే వివాహాలు చేసుకుంటే భావితరాలకు ఆరోగ్యకరమైన బిడ్డలను అందిచగలరని పేర్కొన్నారు. అనంతరం గణేష్ సర్కిల్‌లో కొవ్వొత్తులను చేతపట్టుకొని ర్యాలీ నిర్వహించారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న మద్యం ప్యాకెట్లు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

మడకశిర: నియోజకవర్గ పరిధిలో గురువారం ఎక్సైజ్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో పెద్ద మొత్తంలో కర్ణాటక మద్యం పట్టుబడింది. రొళ్ల మండలం టీడీపల్లి క్రాస్ వద్ద పట్టుబడిన నగేష్ నుంచి 40, ఆర్.వ.ద్రహట్టిలో తిప్పే స్వామి నుంచి 245 కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ శంకర్ తెలిపారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

పెనుకొండ రూరల్: మండలంలోని వెంకటగిరి పాళ్యం గ్రామానికి చెందిన బోయ నాగేంద్ర (33) పాము కాటుతో మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... రోజులాగే మంగళవారం సాయంత్రం పొలం పనులు ముగించుకుని ఇంటికి వెళుతున్న ఆయనను పాము కాటేసింది. పుట్టుకతో మూగ కావడంతో విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపలేక పోయాడు. బుధవారం రాత్రి కాలు వాపు గమనించిన కుటుంబసభ్యులు వెంటనే గుట్టూరులోని ఓ ఆర్ఎంపీ క్లినిక్‌కు తీసుకెళ్లారు. వైద్యుడి సూచన మేరకు అనంతపురానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి శుక్రవారం, శనివారం రెండు రోజుల పాటు స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీపీజీసెట్–2024లో ఉత్తీర్ణులు కాకపోయినా, పరీక్ష రాయకపోయినా కేవలం డిగ్రీ ఉత్తీర్ణత ద్వారా ఎంఏ ఇంగ్లిష్, ఎంఏ ఎకనామిక్స్, ఎమ్మెస్సీ బాటనీ, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఎమ్మెస్సీ జువాలజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చని తెలియజేశారు. స్పాట్ అడ్మిషన్ ద్వారా ప్రవేశాలు పొందే విద్యార్థులు మొత్తం కోర్సు ఫీజు, అడ్మిషన్ ఫీజు చెల్లించాల్సి ఉటుందని, వీరికి ప్రభుత్వం నుంచి స్కాలర్‌షిప్ రాదని స్పష్టం చేశారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలో ఆయా డిపార్ట్‌మెంట్ల లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

బీర్ బలులు



- కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన ఓ యువకుడు డిగ్రీ చదివేందుకు అనంతపురం వచ్చాడు. బీరు తాగితే ఏమీ కాదంటూ ఇక్కడి స్నేహితులు అతనికి అలవాటు చేశారు. దీంతో నిత్యం రెండు మూడు బీర్లు తాగేవాడు. కొన్నిరోజులకే ఊబకాయుడిగా తయారయ్యాడు.
- నగరంలోని అరవిందనగర్‌కు చెందిన ఓ యువకుడు బీర్లు తాగడం అలవాటు చేసుకున్నాడు. నిత్యం బీర్లు తాగనిదే నిద్రపోని అతను.. నెలరోజుల్లోనే విపరీతంగా బరువు పెరిగాడు. ఈ క్రమంలోనే సహచరులు అవహేళన చేయడం ప్రారంభించడంతో బరువు తగ్గడానికి కొన్ని రోజులుగా ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాడు.

- విచ్చలవిడిగా బీర్ల వినియోగం
- 45 రోజుల్లో ఉమ్మడి అనంతపురంలో 12 లక్షల బీర్ల అమ్మకం
- మితిమీరిన కార్బొహైడ్రేడ్, కేలరీస్ కారణంగా పెరుగుతున్న పొట్టలు
- ఒక్క బీరు తాగితే నగటున 208 కేలరీలు శరీరంలోకి
- చికెన్, మటన్‌లు తినడంతో మరో 200 కేలరీలు అదనం
- 30 ఏళ్లకే ఊబకాయులుగా మారుతున్న యువకులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: కుర్రాళ్లకు బీర్లు తాగడం ఇటీవల ఫ్యాషన్‌గా మారింది. ఫ్రెండ్స్‌తో పార్టీల పేరుతో మితిమీరి బీర్లు సేవిస్తున్నట్లు తేలింది. ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న వారు కూడా పార్టీల పేరున విచ్చలవిడిగా బీర్లు తాగుతున్నారు. గడిచిన 45 రోజుల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రమారమి 12 లక్షల పైచిలుకు బీర్లు అమ్ముడయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. బీరు ఏమీ కాదు, ఆల్కహాల్ తక్కువగా ఉంటుంది అంటూ సీనియర్లు ముగ్గులోకి దించి ఆ తర్వాత నెమ్మదిగా విస్కీ, బ్రాందీలకు అలవాటు పడేలా చేస్తున్నారు. మరీ ముఖ్యంగా స్ట్రాంగ్ బీర్లపైన యువకులు ఎక్కువ మక్కువ చూపుతున్నట్లు తెలిసింది. .

ఊబకాయం ఉచితం..

బీర్లు ఎక్కువగా తాగడం వల్ల చిన్న వయసులోనే ఊబకాయులుగా మారుతున్నట్టు వైద్యుల పరిశీలనలో వెల్లడైంది. ఎక్కువ మోతాదులో కార్బొహైడ్రేడ్‌లు, కేలరీలు శరీరంలో చేరడం, దీనికి తగ్గట్టు వ్యాయామం లేకపోవడం కారణంగా పొట్ట సైజు భారీగా పెరుగుతోంది. దీనికి తోడు బీరు సేవిస్తున్న సమయంలో చికెన్, మటన్, నిల్వ ఉన్న చిప్స్, ఎక్కువ నూనెలో చేసిన వేపుళ్లు వంటివి తినడం వల్ల అదనంగా మరో 250 కేలరీలు పొట్టలోకి చేరుతున్నాయి. సాధారణంగా రోజువారీగా తినే ఆహారంలో 2 వేల కేలరీల వరకూ వస్తాయి. బీర్లు తాగడం, తాగే సమయంలో ఎక్కువ మోతాదులో నాన్‌వెజ్ తీసుకోవడం వల్ల అదనపు కేలరీలను కరిగించేందుకు వ్యాయామం చేయాలి. అది లేకపోవడం వల్లే ఈ పొట్టల సైజు భారీగా పెరుగుతోంది. పెళ్లికి ముందే ఊబకాయం ఉండటం వల్ల కొంతమంది యువకులకు పెళ్లిళ్లు సకాలంలో కావడం లేదు. బీర్లు ఎక్కువగా సేవిస్తూ వ్యాయామం చేయకపోతే నెల రోజుల్లోనే బరువు పెరిగే అవకాశం ఉన్నట్టు వైద్యులు హెచ్చరిస్తున్నారు.

గుండెకు ముప్పు



బీర్లు అనేవి చాలా హై కేలరీ డ్రింక్. దీనివల్ల వేగంగా శరీర బరువు పెరిగే అవకాశం ఉంటుంది. దీంతో పాటు శరీరంలో కొవ్వులు పెరిగే అవకాశం ఎక్కువ. ఆల్కహాల్ పర్సెంటేజీ తక్కువ ఉండొచ్చుగానీ, కార్బోహైడ్రేడ్స్ ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువ హాని చేస్తాయి. శరీర బరువు పెరగడం, కొలెస్ట్రాల్ పెరగడం అంటే గుండెకు ముప్పు వస్తున్నట్టే.

– డా.వంశీకృష్ణ, హృద్రోగ నిపుణులు, అనంతపురం

650 ఎంఎల్ బీరు తాగితే శరీరంలో చేరేవి..	
కార్బొహైడ్రేడ్లు	23.42
కేలరీలు	208-284
ప్రోటీన్లు	3.03
ఆల్కహాల్	5 శాతం

గడిచిన 45 రోజుల్లో ఉమ్మడి అనంత జిల్లాలో బీర్ల అమ్మకం ఇలా	
అనంతపురం జిల్లాలో బీర్ కేసుల అమ్మకం	62,531
బాటిళ్ల లెక్కన అయితే	7,50,372
శ్రీసత్యసాయి జిల్లాలో బీర్ కేసుల అమ్మకం	37,892
బాటిళ్ల లెక్కన	4,54,704
మొత్తం బాటిళ్ల వినియోగం	12,05,076
బీర్ల వినియోగానికి అయిన వ్యయం	రూ.24,10,15,200

జగన్ పాలనకు పూలేనే ఆదర్శం

- జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



పెనుకొండ రూరల్: రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభ్యున్నతి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని, తన ఐదేళ్ల పరిపాలనలో సంక్షేమ సామ్రాట్‌గా దేశవ్యాప్తంగా ఆయన ఖ్యాతి గాంచారంటూ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం పూలే చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఓ ప్రకటన విడుదల చేశారు. బీసీల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే చేసిన కృషిని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలోనే వైఎస్ జగనన్న నడుస్తూ బీసీల అభ్యున్నతికి బాటలు వేశారన్నారు. బీసీ కులాల వారీగా కార్పొరేషన్లు, బోర్డులు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నాడు వైఎస్ జగన్ నేరవేర్చారన్నారు.

సోషల్ మీడియా యాక్టివిస్ట్ అరెస్ట్


ప్రతాప్‌గౌడ

పావగడ: సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు చేస్తున్నాడంటూ పావగడ తాలూకా కరెక్యాతనహళ్లికి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్ట్ ప్రతాప్‌గౌడను పోలీసులు అరెస్ట్ చేశారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు వ్యతిరేకంగా కొన్ని రోజులుగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో బెంగళూరులో ఉన్న నిందితుడు ప్రతాప్‌గౌడను గురువారం అరసికెరె పోలీసులు అరెస్ట్ చేశారు.

బాల్య వివాహం... ఆరుగురిపై కేసు నమోదు

యాడికి: మైనర్ బాలికకు వివాహం చేసిన ఘటనలో ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఈరన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి తెలిపిన మేరకు... తాడిపత్రి మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక (14)కు యాడికికి చెందిన ఓ యువకుడి(21)తో ఇరువైపులా కుటుంబ సభ్యులు 2022, ఏప్రిల్ 21న కమలపాడు పంచాయతీ పరిధిలోని కొత్త వెంకటరమణ స్వామి ఆలయంలో పెళ్లి జరిపించారు. రెండేళ్లు తిరక్కుండానే ఇద్దరూ విడిపోయారు. ఈ క్రమంలో తన చెల్లెలు జీవితాన్ని చక్కదిద్దాలంటూ బాలిక సోదరుడు గుత్తి కోర్టును ఆశ్రయించాడు. విషయం తెలుసుకున్న న్యాయమూర్తి... పోలీసులు, ఐసీడీఎస్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు సీఐ ఈరన్న విచారణ చేపట్టి పెళ్లి చేసుకున్న యువకుడితో పాటు ఆయన తల్లిదండ్రులు, బాలిక తల్లిదండ్రులు, సోదరుడిపై కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ మెడలు వంచుదాం

- ప్రజలు గగ్గోలు పెడుతున్నా పట్టదా?
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మండిపాటు


మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ''పంట నష్టపోయిన రైతులను ఆదుకోకుండా, మద్దతు ధర కల్పించకుండా రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం ఏడిపిస్తోంది. 'తల్లికి వందనం', 'అన్నదాత సుఖీభవ', 'నిరుద్యోగ భృతి', 'ఉచిత సిలిండర్లు', 'ఫ్రీ బస్సు' అంటూ ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన చంద్రబాబు ప్రభుత్వ మెడలు వచ్చేందుకు ప్రజలు సన్నద్ధమవ్వాలి'' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ అధ్యక్షురాలు పురంధరేశ్వరికి ప్రజలకు మేలు చేయాలనే ఆలోచన లేదని విమర్శించారు. ఉమ్మడి జిల్లాలోని 63 మండలాల్లో కేవలం 17 మండలాల్లోనే కరువు ఉన్నట్లు అధికారులు తప్పుడు నివేదికలు రూపొందించారని దుయ్యబట్టారు. జిల్లాలోని ఏడు మండలాల్లో రూ.17.60 కోట్లు, శ్రీ సత్యసాయి జిల్లాలో రూ.25 కోట్లు మాత్రమే నష్టం వాటిల్లినట్లు లెక్కగట్టి తీరని అన్యాయం చేశారని వాపోయారు. హంద్రీనీవా సామర్థ్యాన్ని 6,200 క్యూసెక్కులకు పెంచడంతోనే రాయలసీమకు ప్రయోజనం చేకూరుతుందని, కానీ కూటమి ప్రభుత్వం 3,500 క్యూసెక్కులకే పరిమితం చేయడం అన్యాయమన్నారు.

రైతులకు దగా..

పంటలకు మద్దతు ధర అని ప్రకటించినా.. ఇంత వరకు ఎక్కడా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని అనంత మండిపడ్డారు. వరి సాధారణ రకం క్వింటాల్ మద్దతు ధర రూ.2,300, ఏ గ్రేడ్ రకం రూ.2,320 అని ప్రకటించి మాటలకే పరిమితమయ్యారని, ప్రస్తుతం రూ.1,950 నుంచి రూ.2,050కు అమ్ముకునే పరిస్థితి ఉందన్నారు. మొక్కజొన్న మద్దతు ధర రూ.2,225 అని ప్రకటించారని, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మొక్క జొన్న క్వింటాల్ రూ.3 వేలు పలికిందని గుర్తు చేశారు. వేరుశనగ రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉందన్నారు. క్వింటాల్ ధర రూ.6,783 ప్రకటించినా బస్తా కేవలం రూ.1,800కే అమ్ముకుంటున్నారన్నారు. అరటి పంట రైతులు గతేడాది తొలి కొయ్య రూ.25 వేల నుంచి రూ.28 వేలు ఉంటే ఈ ఏడాది కేవలం 17 వేల నుంచి రూ.19 వేలు, రెండో కొయ్య గతంలో రూ.19 వేల నుంచి రూ.20వేలు ఉంటే.. ఈ ఏడాది రూ.12 వేల నుంచి రూ.13 వేలు మాత్రమే పలుకుతోందన్నారు.

అండగా నిలిచిన జగనన్న..

గత ప్రభుత్వంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పెట్టుబడి సాయంగా ఏటా రూ.13,500ను మూడు విడతల్లో రైతులకు అందజేశారన్నారు. ఏకంగా రూ.1,900 కోట్లు అందించి ఆదుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో 'అన్నదాత సుఖీభవ' కింద రూ.20,000 ఇస్తామని మాట తప్పారని మండిపడ్డారు.

ప్రగల్భాల మంత్రి నాదెండ్ల..

రాష్ట్ర వ్యాప్తంగా 37 లక్షల మెట్రిక్ టన్నులు సేకరిస్తామని సివిల్ సప్లయిస్ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రగల్భాలు పలికారని, క్షేత్రస్థాయిలో మాత్రం ఇప్పటి వరకు కేవలం 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించారని ఆయన వివరించారు. ఆయిల్‌ఫెడ్ ద్వారా అరటిని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా, పదేళ్ల క్రితమే ఆయిల్‌ఫెడ్‌ను మూసేశారన్నారు. జిల్లాలో ఎరువుల వ్యాపారులు రైతులను దోపిడీ చేస్తున్నా కలెక్టర్, అధికారులకు కన్పించడం లేదా అని ప్రశ్నించారు.

వారిపై పీడీ యాక్ట్ పెట్టరా?

ఇసుక, మద్యం, బూడిద అమ్మకాల ద్వారా దోచుకోవడంలో తేడాలు వచ్చి ఎమ్మెల్యేలు గొడవలకు దిగుతున్న దౌర్భాగ్య స్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. వారిపై పీడీ యాక్ట్ పెట్టేలా సీఎం చర్యలు తీసుకోలేరా? అని ప్రశ్నించారు.రాయలసీమ థర్మల్ పవర్‌లో ఫ్లైయాష్‌ను ప్రభుత్వమే అమ్ముకుని ఆదాయం పెంచుకోవచ్చని సూచించారు. ఇప్పటికైనా మేలుకోకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

ప్రాణాలు బలిగొన్న అతివేగం

- తూముకుంట చెక్‌పోస్టు వద్ద ఘటన
- ట్రాక్టర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం
- ఇద్దరి దుర్మరణం


ఘటనాస్థలంలో పడి ఉన్న మృతదేహాలు

హిందూపురం అర్బన్: అతి వేగం ఇద్దరి ప్రాణాలు బలిగొంది. రోడ్డు భద్రత నిబంధనలు పాటించకపోవడం... వేగాన్ని నియంత్రించుకోలేక పోవడమే ఇందుకు కారణంగా పోలీసుల ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది.

ట్రాక్టర్ ట్రాలీ కిందకు దూసుకెళ్లిన స్కూటీ..

హిందూపురం పట్టణానికి చెందిన షేక్ దాదాపీర్ (36), పవన్‌కుమార్ (26) గురువారం ఉదయం వ్యక్తిగత పనిపై కర్ణాటకలోని గౌరిబిదనూరుకు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని సాయంత్రం స్కూటీపై తిరుగుప్రయాణమైన వారు హిందూపురం మండలం తూముకుంట ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్దకు చేరుకోగానే మలుపు తిరుగుతున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. ట్రాలీ కిందకు స్కూటీ దూసుకెళ్లింది. ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు.

హెల్మెట్ ఉండి ఉంటే...

ప్రమాదానికి అతి వేగమే కారణంగా తెలుస్తోంది. మలుపు తిరుగుతున్న ట్రాక్టర్‌ను గమనించగానే ద్విచక్ర వాహనదారులు నియంత్రించుకోలేక నేరుగా వెళ్లి ఢీకొన్నారు. ఘటనలో తలలు పగిలి దుర్మరణం పాలయ్యారు. శరీరంపై చిన్నపాటి గాయాలయ్యాయి. ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ ధరించి ఉంటే ప్రమాద తీవ్రత ఇంతగా ఉండేది కాదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కాగా, హిందూపురంలోని త్యాగరాజ నగర్‌కు చెందిన పవన్‌కుమార్... స్థానిక బెంగళూరు రోడ్డులోని ఓ ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. రెండు నెలల క్రితమే ఆయనకు వివాహమైంది. అదే ప్రాంతానికి చెందిన షేక్‌దాదాపీర్ కార్పెంటర్ పనితో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మిన్నంటిన రోదనలు..

ప్రమాదం జరిగిన వెంటనే హిందూపురం సీఐ ఆంజనేయులు, సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను హిందూపురంలోని జిల్లాస్పత్రికి తరలించారు. వాహనాలను తొలగించి ట్రాఫిక్ పునరుద్ధరించారు. విషయం తెలుసుకున్న మృతుల కుటుంబీకులు, బంధువులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి చేరుకున్నారు. మృతదేహాలను చూసి బోరున విలపిస్తున్న వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. ఘటనపై హిందూపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బధిరుల క్రికెట్ టోర్నీ విజేత ఒడిశా

అనంతపురం: బధిరుల అండర్–19 జాతీయ క్రికెట్ చాంపియన్‌షిప్ (ఐడీసీఏ)ను ఒడిశా జట్టు కై వసం చేసుకుంది. అనంత క్రీడాగ్రామం వేదికగా ఆర్డీటీ స్టేడియంలో గురువారం డెఫ్ ఒడిశా, డెఫ్ హర్యానా మధ్య ఫైనల్ పోటీ హోరాహోరీగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన డెఫ్ ఒడిశా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 138 పరుగులు చేసింది. జట్టులో సనితొట్టి 42 పరుగులతో రాణించాడు. అనంతరం బరిలో దిగిన డెఫ్ హర్యానా జట్టు 17.4 ఓవర్లలో పది వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. 40 పరుగుల తేడాతో ఒడిశా జట్టు గెలుపొందింది. సిరీస్ బెస్ట్ బ్యాటర్‌గా ఆర్వేటి లోకేష్ 126 పరుగులు, బెస్ట్‌బౌలర్‌గా పి. విజయ భాస్కర్ (ఏపీ – 12 వికెట్లు), మ్యాన్ ఆఫ్ ది సిరీస్ సనితొట్టి (ఒడిశా – 116 పరుగులు, 8 వికెట్లు, రెండు క్యాచ్‌లు) నిలిచారు. విజేతలను అభినందిస్తూ ట్రోఫీలను ఐడీసీఏ సెక్రెటరీ అజయ్, స్పోర్ట్స్ అకాడమీ మేనేజర్ శ్రీదేవి, డెఫ్ క్రికెట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు కె.గోపీనాథ్, సత్యనారాయణరెడ్డి, తదితరులు అందించారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

అనంతపురం ఎడ్యుకేషన్: 2025 మార్చిలో జరిగే ఇంటర్ వార్షిక పరీక్షలకు సంబంధించి ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించేందుకు డిసెంబరు 15 వరకు గడువు పొడిగిస్తూ ఇంటర్ బోర్డు క్రితిక శుక్లా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ఇంటర్ (జనరల్, ఒకేషనల్) ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు, ప్రైవేట్ (ఫెయిలైన) విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్ బోర్డు ఆర్ఐఓ వెంకటరమణనాయక్ తెలిపారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు చొరవ తీసుకుని విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. ఇదే చివరి అవకాశం అని స్పష్టం చేశారు.